క్లుప్తంగా

ఫొటోగ్రాఫర్ శేఖర్‌కు జాతీయస్థాయి బహుమతి



బహుమతి అందుకుంటున్న శేఖర్

రాజమహేంద్రవరం సిటీ: కేరళలో జరిగిన జాతీయస్థాయి ఫొటోవర్క్‌షాప్‌లో నగరానికి చెందిన ఫొటోగ్రాఫర్ ఎస్ఎంఎస్ శేఖర్ బహుమతి దక్కించుకున్నారు. ఈ జాతీయ స్థాయి పోటీలలో దేశంలో అన్ని రాష్ట్రాల నుంచి 50 మంది పాల్గొన్నారు. కేరళ సంప్రదాయ కళలైన కథాకళి, తీయు కడియార పట్టు, ట్రావెలింగ్ ఫొటోగ్రఫీ అంశాలపై జరిగిన వర్క్‌షాప్ స్పాట్ కాంపిటేషన్‌లో శేఖర్ కన్సోలేషన్ బహుమతి లభించింది. శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయనకు రాజమండ్రి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ల హక్కులపై సదస్సు

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ న్యాయవాది కె.ప్రత్యూష కుమారి శుక్రవారం ట్రాన్స్‌జెండర్ల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులను వివరించారు. వాటిని వినియోగించుకున్నప్పుడే సామాజికంగా బలపడతారన్నారు. అలాగే స్వయం ఉపాధి కోసం అందుబాటులో ఉన్న సబ్సిడీలను వివరించారు. ఎలాంటి న్యాయ సమస్యలున్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. సదస్సులో డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు డాక్టర్ పి.లక్ష్మీదేవి, డాక్టర్ బి.రవి కుమార్, డాక్టర్ ఆర్.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మినీజాబ్ మేళాలో 86 మందికి ఉద్యోగాలు

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్ ఆవరణలోని నేక్‌లో శుక్రవారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మినీజాబ్ మేళాలో 86 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. నాలుగు కంపెనీలలో ఉద్యోగాల కోసం 167 మంది హాజరు కాగా, వారిలో 86 మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ జున్నూరి రాజు, ప్లేస్‌మెంట్ అధికారి బాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గాయకుడు కిషోర్ కుమార్‌కు నివాళి


కార్యక్రమంలో పాల్గొన్న జిత్ మోహన్ మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బహుభాషా గాయకుడు కిషోర్ కుమార్ 37వ వర్ధంతిని శుక్రవారం స్థానిక జిత్ మోహన్ మిత్ర కళావేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నట, గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షత వహించారు. ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రకాశనం గావించిన ఈ కార్యక్రమానికి పీవీఎస్ కృష్ణారావు, బి.సీతారామారావు, దేశిరెడ్డి బలరాం నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూజిళ్ల సూరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. శ్రీమిత్ర మాట్లాడుతూ కిషోర్ కుమార్ తన మధుర గాత్రంతో ఎన్నో గొప్ప పాటలు ఆలపించారన్నారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్మాణాలు వద్దు

రాజమహేంద్రవరం సిటీ: గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం ఏవిధమైన నిర్మాణాలు తలపెట్టవద్దని దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఆ విగ్రహం వద్ద పాత పార్లమెంట్ భవన నమూనాలో నిర్మాణం చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారని, అది సరైంది కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలో ఎకరం భూమి కేటాయించి ప్రతిపాదిత కట్టడం కట్టి, ఎస్సీ స్టడీ సర్కిల్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బర్రే కొండబాబు, మర్రి బాబ్జీ, అజ్జరపు వాసు, వైరాల అప్పారావు, ఎల్‌వీ ప్రసాదరావు, పరమట గణేశ్వరరావు, పట్నాల విజయ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీశ్రీ స్మారక సభ

ప్రకాశం నగర్: వాగ్దేవి ఛారిటబుల్ ట్రస్ట్, గౌతమీ వైద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శ్రీశ్రీ స్మారక సభ కనుల పండువగా జరిగింది. కార్యక్రమానికి శాంత బయోటెక్ అధినేత, పద్మ విభూషణ్ శ్రీవర ప్రసాదరెడ్డి, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ సుసంపన్నమైన భారతీయ సంస్కృతి ఎన్నో విభిన్న వాదాలని, ఉద్యమాలకు ఊపిరి పోసిందన్నారు.

రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం

- విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి
- కలెక్టర్ మాధవీలత



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. స్థానిక లాలాచెరువు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ్, నా భూమి నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తూ విద్యా విప్లవం చేపట్టిందన్నారు. విద్యే మనకు ఆస్తి అని, చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చక్కని విద్యాబోధన అందిస్తున్నారని, ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న త్యాగధనుల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. స్వచ్ఛమైన మట్టి, గాలి, సమగ్ర అభివృద్ధిని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ముందుగా మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఈవో ఎస్.అబ్రహం, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కడియం బాలికలు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కడియం విద్యార్థులు

కడియం: ఏపీ ఎస్సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి జిల్లా స్థాయి జానపద నృత్యం, లఘు నాటికల పోటీలు బొమ్మూరు డైట్ కాలేజీలో రెండు రోజుల పాటు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 25 స్కూళ్లు పాల్గొన్నాయి. కడియం హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన దేవుడా నా దేశాన్ని కాపాడు అనే లఘునాటిక ప్రథమ స్థానంలో నిలిచి, అమరావతిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. నేటి యువత తెలిసీ తెలియక మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారన్న ఇతివృత్తంతో తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ రచించి, శిక్షణ ఇచ్చారు. పవిత్ర, యశస్విని, జయశ్రీ, లేఖన ప్రదర్శన ఇచ్చారు. వీరిని డీఈవో నారాయణ, ఎంఈవోలు లజపతిరాయ్, నాగేశ్వరరావు, స్కూలు హెచ్ఎం సత్యనారాయణ, ఎస్ఎంఎస్ చైర్మన్ ఎస్. లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ కోడిగుడ్డు తినాలి


కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ సత్యగోవింద్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు కోడి గుడ్డు తినాలని జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ అన్నారు. ప్రపంచ గుడ్డు దినోత్సవం సందర్భంగా శుక్రవారం దేవీచౌక్‌లోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి పశుసంవర్ధకశాఖ సమావేశం నిర్వహించారు. పశుసంవర్ధక సహాయకులు, పశు వైద్యులు, సహాయ సంచాలకులు, ఉప సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ సత్యగోవింద్ మాట్లాడుతూ కలెక్టర్ మాధవీలత పర్యవేక్షణలో పశుసంవర్ధక శాఖలో జగనన్న పాల వెల్లువ, 1962 మొబైల్ పశు చికిత్స వాహనాల వంటి ఎన్నో ముఖ్యమైన ప్రభుత్వ పథకాలతో పాటు జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ మక్కెన వెంకటేశ్వర్లు, కొవ్వూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ జి.రాధాకృష్ణ, కాకినాడ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి


రీజనల్ డైరెక్టర్ అరుణవల్లికి వినతిపత్రం అందిస్తున్న జగ్గారావు తదితరులు

సీటీఆర్ఐ: వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలని ఏపీ వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటేరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దడాల జగ్గారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక వీఎల్ పురంలోని టౌన్, కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ అరుణవల్లిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జగ్గారావు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి దాదాపు 3 వేల మంది వార్డు ప్రణాళిక కార్యదర్శులను నియమించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. అర్హత ఉన్న వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ కార్యదర్శులందరికీ నేరుగా పదోన్నతులు కల్పించాలన్నారు. వార్డు ప్రణాళిక కార్యదర్శులు రీసర్వేలో పాల్గొన్నందున బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ పేరెల్లి శ్రీహర్ష కుమార్, సన్నీబాబు, రాజశేఖర్ రాయుడు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే సీఎం జగన్ లక్ష్యం


వీరవరంలో మందులు పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్


తొర్రేడులో వైద్యశిబిరాన్ని పరిశీలించి, సూచనలు చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్, చిత్రంలో డాక్టర్ అనసూరి పద్మలత

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వీరవరంలో వైద్యశిబిరం

కడియం: రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వీరవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తోందన్నారు. అనంతరం చందన నాగేశ్వర్‌కు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, స్థానిక నాయకులు బత్తుల రాము, కొత్తపల్లి రాము, రేమళ్ల ప్రసాద్, దొంతంశెట్టి చిన వీర్రాజు, ఎంపీడీవో కె.రత్నకుమారి పాల్గొన్నారు. శిబిరంలో 453 మందికి వైద్య పరీక్షలు చేశారు.

ప్రజల చెంతకే వైద్యం

రాజమహేంద్రవరం రూరల్: దేశంలో తొలిసారిగా ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలందించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత అన్నారు. తొర్రేడు గ్రామ సచివాలయం 1 పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. దానిని అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్, డాక్టర్ అనసూరి పద్మలత పరిశీలించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 498 మందికి వైద్యసేవలు అందించగా, 31 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫర్ చేశారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి చెరుకూరి రాణి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు, తొర్రేడు సొసైటీ చైర్మన్ చిట్టూరి వెంకటరావు, పర్సన్ సభ్యులు దండమూడి అర్జునరావు, గద్దె సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు మిరియం నెహ్రూ, దాసరి గోపాలకృష్ణ, గౌషియా బేగం, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు, నాయకులు పెద్దింటి సత్తిపండు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెప్మా అర్బన్ మార్కెట్



పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగుల స్టాల్

రాజమహేంద్రవరం సిటీ: స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌కు నగర ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రవిశంకర్ అన్నారు. నగరంలోని పుష్కరఘాట్ వద్ద ప్రతినెలా రెండవ గురు, శుక్రవారాల్లో ఈ బజార్ నిర్వహిస్తున్నారు. వివిధ పచ్చళ్లు, చీరలు, చేనేత, హస్తకళల బొమ్మలు, వైరు బుట్టలు, జూట్ బ్యాగులు, పంజాబీ డ్రెస్సులు తదితర వాటిని విక్రయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా డీఆర్పీ శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్థానిక కంటిపూడి రామారావు, నెహ్రూ నగర్ మున్సిపల్ స్కూళ్లలో శుక్రవారం మోల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిపి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు. కె.వెంకటరావు, వి.శ్రీధర్, బి.వెంకటరావు, టి.నర్సింహమూర్తి, ఎం.పద్మజ, వి.దుర్గా ప్రవీణ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కేంద్రమే కాపాడాలి

సాక్షి, రాజమహేంద్రవరం: ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత అశోక్ గజపతిరాజు అన్నారు.బాబు అరెస్టు అనంతరం రాజమహేంద్రవరంలో ఉంటున్న ఆయన సతీమణి భువనేశ్వరిని శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో వచ్చి పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాగా.. సెంట్రల్ జైలులో చంద్రబాబు ఆరోగ్యంపై వాస్తవాలు వెల్లడించాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త ఆదిరెడ్డి వాసు, పలువురు టీడీపీ నాయకులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలును ముట్టడించేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. రాజమహేంద్రవరంలోని లోకేష్ క్యాంపు నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు సెంట్రల్ జైలు వరకు చేరుకున్నారు. గమనించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజకీయ కక్షతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. బొమ్మూరు గ్రామంలో క్లస్టర్–4లో జరిగిన బాబుతో నేను సైతం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

15న వైద్య శిబిరం

కడియం: ఎన్టీఆర్ ట్రస్ట్, జీఎస్ఆర్ గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సహకారంతో కడియం హైస్కూల్లో ఆదివారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. ఆయన శుక్రవారం కడియంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- డ్రైనేజీ, సీసీ రోడ్లకు శంకుస్థాపన


నగరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలు పరిష్కరించి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. ఆయన శుక్రవారం నగరంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 24వ డివిజన్ మోచీ వీధిలో రూ.4.80 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ నగరాన్ని అభివృద్ధి చేయడానికి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

రూ.1.68 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

స్థానిక 31వ డివిజన్ ఆజాద్ చౌక్ ఏరియాలో రూ.1.68 కోట్లతో నిర్మిస్తున్న సీసీ రోడ్లకు శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం ఆధ్వర్యంలో శంకుస్థాపన అనంతరం నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. స్థానిక 31, 28, 29, 36 డివిజన్ల పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు.

శిథిల డ్రైనేజీలను పునర్నిర్మించాలి

డ్రైనేజీలను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు కల్వర్టులను ఎత్తు చేయాలని సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. స్థానిక 21వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి ఏపీ రమణ ఆధ్వర్యంలో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. కొత్తగా మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, కుక్కల బెడదను నివారించాలని స్థానికులు తెలిపారు.

వినియోగంలోకి దుర్గా వారి సత్రం

23వ డివిజన్‌లోని దుర్గా వారి సత్రాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతానని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి వాకచర్ల కృష్ణ ఆధ్వర్యంలో సత్రాన్ని పరిశీలించారు. ఐదేళ్లుగా ప్రారంభానికి నోచుకోకుండా ఉన్న ఈ సత్రం విషయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమా మార్కండేయేశ్వరస్వామి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ఇన్నమూరి దీపు, 22వ డివిజన్ ఇన్‌చార్జి దూర్వాసుల సత్యనారాయణ, నగర ట్రేడ్ యూనియన్ చైర్మన్ సప్పా ఆదినారాయణ, 24వ డివిజన్ ఇన్‌చార్జి అరవ సురేష్, మాజీ కార్పొరేటర్ బెజవాడ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం


సమావేశంలో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- హుకుంపేటలో బీసీల ఆత్మీయ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బీసీల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని, వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం హుకుంపేట డిబ్లాక్‌లోని గౌతమీ నగర్‌లో బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల కాలంలో బీసీలను బ్యాక్‌బోన్‌గా భావించి, కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు సముచితస్థానం కల్పించామన్నారు. ఆయనకు సంపూర్ణ మద్దతు, ఆశీసులు అందజేసి, రాబోయే ఎన్నికలలో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత బీసీలందరిపైనా ఉందన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఈలి గోపాలం

కడియం: ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తుగానే అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం అన్నారు. ఆయన అధ్యక్షతన కడియం మండలం వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి మాట్లాడుతూ రైతులు ఆర్బీకేల్లో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా పాస్‌బుక్‌లు పొందిన వారు కూడా ఈ నెల 15లోపు నమోదు చేయించుకోవాలన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేస్తారన్నారు. మండల ఇరిగేషన్ జేసీ శ్రీకాంతియా మాట్లాడుతూ ఆవలోని కాలువలను శుభ్రం చేయించడానికి చర్యలు చేపట్టామన్నారు. ఉద్యానశాఖాధికారి సుధీర్ కుమార్ మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై డ్రిప్ అందిస్తున్నామన్నారు. సమావేశంలో ఏడీఏ జయరామలక్ష్మి, తహసీల్దార్ ఎం.సుజాత, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.